ప్రజాశక్తి
సోమవారం 9 డిసెంబర్ 2024
8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

వేతన వెతలు

- కార్మికుల కుటుంబాల్లో ఆకలికేకలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న పారిశుధ్య (ఆప్కాస్) కార్మికులు
- డివిజన్ల వారీగా నిరసనలు
- మాటలతో సరిపెడుతున్న విఎంసి అధికారులు

తెల్లవారుజామున డివిజన్లలో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థలో పారిశుధ్య (ఆప్కాస్) కార్మికులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 10న మంగళవారం నగరపాలక సంస్థ వద్ద మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వేలాది మంది కార్మికులు ధర్నా నిర్వహించనున్నారు. ఈ ఆందోళనను విజయవంతం చేసేందుకు వివిధ రూపాల్లో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. డివిజన్ల వారీగా నిరసనలు, ఆందోళనలు, వీధి మీటింగ్‌లు, కరపత్రాల పంపిణీ తదితర రూపాల్లో కార్మికులు నాలుగైదు రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న 4,774 మంది పారిశుధ్య (ఆప్కాస్) కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాల్సి ఉంది. 9వ తేదీ వచ్చినా వేతనాలు ఇచ్చే పరిస్థితుల్లో అతీగతీ లేకుండా పోయింది. చివ్వుమనే చలిలో తెల్లవారక ముందే వీధులు శుభ్రపరిచేందుకు వచ్చే కార్మికులను కూడా ప్రభుత్వం, అధికారులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. పని భారం... చాలీ చాలనీ వేతనాలు...పెరిగిన ధరలు...వీటి మధ్యకొట్టుమిట్టాడుతున్న కుటుంబాలు. కష్టపడి వచ్చి కడుపు నింపుకుందామంటే గింజలు లేని పరిస్తితి. పసిపిల్లలు ఆకలికేకలతో అలమటించే పరిస్థితులు పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో సర్వసాధారణమైంది. కార్మికుల వేతనాలు మంజూరు చేయాలని యూనియన్ నేతలు విఎంసి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా... డివిజన్లలో కార్మికులు వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నా... విఎంసి అధికారులు మాటలతో సరిపుచ్చుతున్నారే తప్పా... వేతనాలు ఇచ్చింది లేదంటూ కార్మికులు, యూనియన్ నేతలు మండిపడుతున్నారు. వేతనాల రాక, అనేక సమస్యలతో ఇబ్బందులు (మిగతా 2లో)

రబీకి నీరు విడుదల చేయలేం

- రైతులు ఆరుతడి పంటలే వేసుకోవాలి
- ఈ నెల 15తో కాలువలకు నీరు నిలిపివేత
- ఇరిగేషన్ విజయవాడ సర్కిల్ ఎస్ఇ మోహన్‌రావు

ప్రజాశక్తి-విజయవాడ

కృష్ణానది పరివాహక ప్రాంత జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న నీటి వనరులు, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రబీ సీజన్‌కు నీరు విడుదల చేయడం సాధ్యం కాదని, రైతులు దీనిని గమనించి ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని ఇరిగేషన్ విజయవాడ సర్కిల్ ఎస్ఇ ఆర్.రామమోహన్‌రావు తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే సాగునీటి కాలువలకు నీటిని విడుదల చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వచ్చిందన్నారు. దీనిపై ఇప్పటికే రైతుల్లో అవగాహన కల్పించామన్నారు. కృష్ణా డెల్టా పరిధిలోని రైవస్, ఏలూరు, బందర్, కెఇబి, వెస్ట్, గుంటూరు ఛానల్స్‌కు పస్తుతం రోజు వారీగా సుమారు ఐదు వేల కూసెక్కులు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సాగునీటి వ్యవస్థ, రబీ సీజన్, డెల్టాలో జరగాల్సిన వివిధ రకాల పనులపై ఎస్ఇ 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల పరిధిలో ఎంత నీరు ఉంది?

జవాబు: పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 45 టిఎంసిలు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 312 టిఎంసిలకు గాను ప్రస్తుతం 305 టిఎంసిల నీరు ఉంది.

ప్రశ్న: ఖరీఫ్‌లో డెల్టాలోని ఆయా కెనాల్స్‌కు మొత్తం ఎంత నీరు విడుదల చేశారు?

జవాబు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొత్తం కృష్ణాడెల్టాలోని ఆయా (మిగతా 2లో)

గ్రంథాలయాల అభివృద్ధికి పునర్వికాస ఉద్యమం

సన్నాహక సమావేశంలో రచయుతలు, ప్రచురణకర్తలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

పాలక ప్రభుత్వాలు గ్రంథాలయాలను నిర్వీర్యం చేస్తున్నాయని, ప్రజలు సెస్‌లురూపంలో చెల్లిస్తున్న పన్నులు పక్కదోవ పడుతున్నాయని, ఈ తరుణంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం చేపట్టాలని రచయితలు, ప్రచురణకర్తలు ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడ సివిల్ కోర్టుల సమీపంలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ భవనంలో ఉద్యమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ 1914లో ఆనాడు సంఘసంస్కర్తలు గ్రంథాలయ ఉద్యమాన్ని చేపట్టారని, దేశ స్వాతంత్ర్యం తర్వాత 1956 కాలంలో గ్రంథాలయ చట్టం ఏర్పడిందని గుర్తు చేశారు. గత ఇరవై ఏళ్లుగా పాలక ప్రభుత్వాలు గ్రంథాలయాలను నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవుల కోసం చర్చిలు, ముస్లింల కోసం మసీదులు, హిందువుల కోసం దేవాలయాలు ఉన్నాయని, జ్ఞానం కోసం సరైన గ్రంథాలయాలు లేవని అన్నారు. ప్రవచనాలు చెపితే జ్ఞానం వస్తుందని పాలకులు భావించడం తప్పుడు సంకేతం అని, ఉచిత పథకాలు రూపంలో ఉచిత బస్సు ప్రయాణం, వంట గ్యాస్, ఇళ్లు ఇవ్వడం కాదని రాజధాని నిర్మాణం కాదని, విద్యాలయాలు గ్రంథాలయాలు పుస్తక పఠనం (మిగతా 2లో)

జక్కంపూడిలో 'హై'టెన్షన్

- పొలాల్లో ల్యాంకో టవర్ల నిర్మాణం
- పనులు అడ్డగించి రోడ్డుపై బైఠాయించిన రైతులు
- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు, విడుదల
- పోలీసుల పహారా మధ్య కొనసాగుతున్న పనులు

రోడ్డుపై బైఠాయించిన రైతులు, నాయకులు

రైతుల్ని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - వన్‌టౌన్, జి.కొండూరు

జక్కంపూడిలో ఆదివారం హైటెన్షన్ నెలకొంది. తమ పొల్లాలో ల్యాంకో హై టెన్షన్ టవర్లు వేయొద్దంటూ అంబాపురం, నైనవరం రైతులు పనులను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఆందోళన చేస్తున్న రైతులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. గత కొంతకాలంగా కలకత్తా, నూజివీడు, మైలవరం వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన గల జక్కంపూడిలోని రైతులకు చెందిన పొలాల్లో నుంచి 11 హై టెన్షన్ టవర్లు వేసేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంకల్పించింది. దీంతో జక్కంపూడిలో పొలాలు కలిగిన రైతులు తమ భూములు పనికి రాకుండా పోతాయని, నూతనంగా హై టెన్షన్ టవర్లు నిర్మించవద్దని పలుమార్లు నిరసనలు తెలిపారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమ పొలాల్లో 11 టవర్లు వేయాల్సినంత అవసరం లేదని, మూడు టవర్లు వేస్తే సరిపోతుందని, అంతేగాక ఉన్న టవర్లు ఎత్తు పెంచుకోవాలని రైతులు కోరారు. సరైన ఎలైన్‌మెంట్ ప్లాన్ కూడా చూపకపోవడంపై రైతులు (మిగతా 2లో)

విఆర్‌ఒ సప్లిమెంటరీ పరీక్షకు 615 మంది హాజరు

విజయవాడ: విజయవాడలోని విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో 634 మందికి విఆర్‌ఒ గ్రేడ్-2 సప్లిమెంటరీ అభ్యర్థులకు రాష్ట్రస్థాయిలో థియరీ, ప్లాటింగ్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 615 మంది హజరయ్యారు. వీరికి గతంలో 15 రోజుల పాటు సామర్లకోటలోని ఆంధ్రప్రదేశ్ సర్వే ట్రైనింగ్ అకాడమీలో సర్వే శిక్షణ ఇచ్చారు. పరీక్షా కేంద్రాన్నీ ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ సర్వే ట్రైనింగ్ అకాడమీ జాయింట్ డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ విఎస్ఎన్ కుమార్, అబ్జర్వర్ కె.శ్రీనివాసరావు, జిల్లా సర్వే సహాయ సంచాలకులు త్రివిక్రమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కళలకు దిక్సూచి

గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-తాడేపల్లి: కళా రంగాన్ని గడపగడపకు తీసుకెళ్లిన దాంట్లో గాదె సుబ్బారెడ్డి కృషి దాగి ఉందని సిపిఎం, ప్రజాసంఘాల, ఇతర పార్టీల నాయకులు కొనియడారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభ సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి అధ్యక్షతన తాడేపల్లి బైపాస్‌రోడ్డులోని సిఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పిఎన్ఎం నాయకులు సుబ్బారెడ్డితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ ఎంబివికె చైర్మన్ పి.మధు మాట్లాడుతూ సమాజంలో 70 శాతంగా ఉన్న పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై అభ్యుదయ రచనలు చేసి ప్రజలకు

గేయాలు ఆలపిస్తున్న పిఎన్ఎం కళాకారులు

అవగాహన కల్పించడంలో ధిట్ట అని కొనియాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి రాష్ట్ర కేంద్రంలో కీలకంగా పని చేస్తున్న సుబ్బారెడ్డి మరణం బాధాకరమని నివాళులర్పించారు. 20 సంవత్సరాల తమ సన్నిహిత్యంలో విలువైన సమయం వెచ్చించి ప్రజా నాట్యమండలి అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. సహజ నటుడు అయిన సుబ్బారెడ్డి టామీ...టామీ...టామీ నాటికలో సామాన్యుడి పాత్ర ప్రజలను విశేషంగా ప్రభావితం చేసిందని వివరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక రాజ్య స్థాపన కోసం కాలికి గజ్జె కట్టి డప్పు చేతపట్టి తన ఆటపాట ద్వారా ప్రజలను మేల్కొల్పిన ధన్యజీవి సుబ్బారెడ్డి అని నివాళులర్పించారు. విజయవాడ ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంబివికె, బాలోత్సవం కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కరోనా కష్టకాలంలో కూడా సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లల్ని భాగస్వామ్యం చేయడంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ మాట్లాడుతూ ఉద్యమంలో పని చేయడానికి కుటుంబం మొత్తం ఆయనకు మద్దతుగా నిలవడం గొప్ప విషయమన్నారు. ఆయన లేని లోటు ప్రజాతంత్ర

సుబ్బారెడ్డికి నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు

ఉద్యమంతో పాటు ఆ కుటుంబానికి కూడా తీరని లోటని చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతు సంఘంలో 15 సంవత్సరాలు పాటు కలిసి పని చేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. సంస్మరణ సభకు తొలి పలుకులు పలికిన ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, సభకు అధ్యక్షత వహించిన ఎం.రవి మాట్లాడుతూ కళా రంగంలో, ప్రజాక్షేత్రంలో ఆయనతో పని చేసిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ సుబ్బారెడ్డికి నివాళులర్పించారు. ముందుగా సుబ్బారెడ్డి చిత్రపటం వద్ద కేంద్ర, రాష్ట్ర నాయకులతో పాటు ఆయనతో పరిచయం ఉన్న అనేక మంది తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళారంగంలో పని చేస్తున్న అనేక మంది ఘనంగా నివాళులర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజా నాట్యమండలి కళాకారులు గంట పాటు తమ సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి సతీమణి శివలీల, కుమార్తెలు శిరీష, ఆషాదేవి, శ్రీకాంత్‌రెడ్డి, శివనాగేంద్రరెడ్డి, గాయకుడు ఎ జగన్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

వేతన వెతలు

పడుతూనే ...నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల గురించి అధికార కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు కనీసంగా కూడా పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. ప్రజాప్రతినిధుల మాటలేమో కోటలు దాటుతుంటే...ఆచరణలో కార్మికులు బాధలు తీరడం లేదు.

వివిధ సెక్షన్లలో దశాబ్దాల తరబడి పని చేస్తున్న ఆప్కాస్ కార్మికుల వేతనాలు గొర్రెతోక బెత్తెడు అన్న చందంగా తయారైంది. వీరికి వచ్చే అతి తక్కువ వేతనంలో కూడా రకరకాల కట్టింగులు పోను చేతికొచ్చే చాలీచాలనీ డబ్బులతో కుటుంబాలు గడవటం కష్టమైంది. పారిశుధ్య కార్మికులు, క్లీనర్లు, మలేరియా సెక్షన్లలో పని చేస్తున్న కార్మికులకు రూ. 21 వేలు వేతనం. దీనిలో కటింగ్‌లు పోను రూ. 18 వేలు చేతికొచ్చేది. అలాగే డ్రైవర్లు, యుజిడిలో పని చేస్తున్న కార్మికులకు రూ. 24,500కు రూ.22 వేలు, ఇంజినీరింగ్, వాటర్ సప్లై, పార్కు సెక్షన్, వీధి దీపాలు, టౌన్‌ప్లానింగ్, మెకానిక్‌లకు రూ.15 వేలల్లో రూ.13 వేలు మాత్రమే వేతనం రూపంలో చేతికొచ్చేది. వీటిల్లో కూడా అనారోగ్యం, ఇతర అత్యవసర పనులపై సెలవులు పెడితే... ఆ వచ్చే అతి తక్కువ వేతనంలో కూడా కోత పడుతుంది. దశాబ్దాలపాటు పని చేస్తున్నా వేతనాల్లో మాత్రంమార్పు ఉండటం లేదు. వైఎస్ఆర్ కాలనీ (జక్కంపూడి) కార్మికులకు మూడు మాసాల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. వీరికిచ్చే రూ.15 వేల వేతనంలో కూడా రెండు వేలు కటింగ్‌లే.

పెరిగిన ఖర్చులు

మరొక వైపున ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇంటి అద్దెలు దగ్గర నుంచి విద్యుత్ బిల్లులు, నిత్యావసర సరుకులు , ప్రయాణ ఖర్చులు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. కార్మికులుంటున్న ఇంటి అద్దెలు రూ. ఆరు వేల నుంచి ఎనిమిది వేలు, ప్రస్తుతం ట్రూ అప్ చార్జీలతో పెరిగిన విద్యుత్ చార్జీలతో రూ. వెయ్యి నుంచి రెండున్నర వేలు, బియ్యం, ఉప్పు, పప్పు, నూనెలు, ఇతర నిత్యావసర సరుకులు వేలకు వేలు ఇలా ప్రతి ఒక్కటి ధర పెరిగుతూనే ఉంది. వచ్చే వేతనం చాలక నెలకు ఎంతోకొంత అప్పులు చేయక తప్పడం లేదని కార్మికులు ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పని భారం

గతంలో ఎన్నడూ లేని రీతిలో కార్మికులు తీవ్రమైన పని వత్తిడిని ఎదుర్కొంటున్నారు. వర్క్ లోడు పెరిగింది. గతంలో ఒక పని చేసే కార్మికుడు ప్రస్తుతం రెండు, మూడు రకాల పనులు చేస్తున్నాడు. రోడ్లుస్వీపింగ్, డ్రైయిన్ల క్లీనింగ్, శానిటేషన్ బండ్లపై కూడా పని చేయక తప్పడం లేదు. రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో కార్మికుల భర్తీ లేదు. ఉదాహరణకు 80 మంది పని చేయాల్సి కృష్ణలంకలోని 22వ డివిజన్‌లో కేవలం 40 మంది లోపులోనే పని చేస్తున్నారు. అలాగే ఇతర డివిజన్లలో కూడాను. 150 మంది కార్మికులను భర్తీ చేసుకోవాలని ఏళ్ల తరబడి ప్రతిపాదన నలుగుతూనే ఉంది. ఆచరణలో భర్తీ చేయడం లేదు. అధికారులు మాటలకే పరిమితం అవుతన్నారు. ఉన్న కార్మికులపై రెండు, మూడు రెట్లు పని భారం పెరిగి త్వరగా అనారోగ్యం పాలవుతున్నారు.

యూనిఫామ్... సబ్బులు... బట్టలు... కాగితాలకే

కార్మికులకు ప్రతి ఏడాది యూనిఫామ్‌తో పాటు సబ్బులు, నూనెలు, చెప్పులు క్రమం తప్పకుండా ఇవ్వాలి. కానీ ఏడు సంవత్సరాల నుంచి విఎంసిలోని కార్మికులకు ఇవి ఇవ్వడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్టేట్‌మెంట్లు, కాగితాలకే పరిమితం అవుతున్నారు. అంతేగాక ప్రతి డివిజన్‌లో శానిటేషన్‌కు ఉపయోగించే పరికరాలు కూడా లేవు. కనీసంగా చీపుర్లు కూడా కార్మికులే కొనుక్కోవాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ట్రై సైకిళ్లు, తోపుడు బండ్లు, పారలు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. వీధుల్లో ఇంటింటికొచ్చి చెత్త సేకరించడానికి వినియోగించడానికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యాస్ ఆటోలను ఈప్రభుత్వం నిలుపుదల చేసింది. ఇప్పటికైనా వేతనాలతో పాటు అన్ని రకాలుగా కార్మికులను ఆదుకోవాలని యూనియన్ నేతలతో పాటు కార్మికులు కోరుతున్నారు. లేకపోతే ఆందోళన బాట తప్పదని వారు హెచ్చరిస్తున్నారు.

జక్కంపూడిలో 'హై'టెన్షన్

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, రైతు సంఘం నాయకులు

మండిపడ్డారు. దీంతో గత నెల 25న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను రైతులు కలిసి తమ సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎటువంటి నష్టం లేకుండా ట్రాన్స్‌కో, జెన్‌కో, ల్యాంకో వారితో సమావేశం ఏర్పాటు చేస్తానని రైతులకు హామీనిచ్చారు. కలెక్టర్ మాటలు నమ్మి న్యాయం జరుగుతుందని ఆశించిన రైతులకు చేదు అనుభవం ఎదురైంది. గత రెండు రోజులుగా ల్యాంకో, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పోలీసుల పహారా నడుమ పనులు ప్రారంభించారు. దీంతో రైతులు ఆదివారం తమ పొలాల వద్దకు వెళ్లి పనులు అడ్డుకున్నారు. పనులు జరగనీయకుండా రోడ్డుపై బైఠాయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వెస్ట్ ఏసిపి దుర్గారావు, టూటౌన్ సిఐ కొండలరావు, సిబ్బంది ఎపి రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పి.వి. ఆంజనేయులు, సిరిపురపు సాంబశివరావు, ఆలూరి వెంకట సత్యనారాయణ, నాయకులు ముదిగొండ కోటేశ్వరరావు, మాతంగి ఆంజనేయులు, ముగడ సురేష్, నిమ్మగడ్డ జోగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డిలతో పాటు ఎనిమిది రైతులను అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్న సమయంలో పూచీకత్తుపై విడుదల చేశారు.

రైతులకు న్యాయం చేయాలి

ఎపి రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు

పోలీసుల పహరా నడుమ మేఘా నిర్మాణ సంస్థ ప్రొక్లెయిన్ పెట్టి జక్కంపూడిలోని పొలాల్లో హై టెన్షన్ టవర్ల నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఒక పక్క ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమది రైతు ప్రభుత్వమని చెబుతూనే మరో పక్క రైతుల నడ్డి విరుస్తున్నారు. రైతులను పని ప్రదేశానికి రాకుండా రెండు వైపులా పోలీసు చెక్‌పోస్టు పెట్టి అటు వైపు వాహనాలు రాకుండా నిలిపివేశారు. రైతుల పొట్టకొట్టి నిర్మాణ పనులు చేయడం సరికాదు. గత నెల 25న రైతు సమస్యలపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను కలిశాం. న్యాయం చేస్తామని చెప్పి నేడు రైతులను అరెస్టు చేసి పనులు చేపట్టారు. ఇది మంచి పద్ధతి కాదు. ఇంతకుముందు ఉన్న హై టెన్షన్ టవర్ల ఎత్తు పెంచాల్సి ఉంది. ప్రస్తుతం 11 టవర్లు నిర్మాణం చేయకుండా కేవలం మూడు టవర్లు నిర్మిస్తే సరిపోతుంది. కలెక్టర్, సంబంధిత అధికారులు ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలి.

గ్రంథాలయాల అభివృద్ధికి పునర్వికాస ఉద్యమం

ద్వారా సామాజిక అభివృద్ధి సాధ్యమని అన్నారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం రాబోయే ఫిబ్రవరి నెల నుండి విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభించి రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని, అన్ని వర్గాల ప్రజలు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రచురణ సంస్థల ప్రతినిధి అశోక్ కుమార్, మనోహర్ నాయుడు, లక్ష్మయ్య, వెంకట నారాయణ, సాహిత్య సంస్థల ప్రతినిధులు మోతుకూరి అరుణ కుమార్, గోళ్ల నారాయణ రావు, చలపాక ప్రకాష్, గుత్తికొండ లక్ష్మి, అన్నే భాస్కరరావు, గుమ్మా సాంబశివరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులను, విద్యా శాఖ అధికారులను కలిసి వినతిపత్రం ఇవ్వాలని, విజయవాడలో భారీ సభా కార్యక్రమం నిర్వహించాలని అన్నారు.

రబీకి నీరు విడుదల చేయలేం

కెనాల్స్‌కు 135 టిఎంసిల నీటిని విడుదల చేశాం.

ప్రశ్న: రబీకి ఎంత నీరు అవసరం కానుంది?

జవాబు: ఈ రబీకి 52 నుంచి 80 టిఎంసిల నీరు కావాల్సి ఉంటుంది.సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటి సామర్థ్యాన్ని పరిశీలిస్తే చాలా తక్కువుగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో సరిపడా నీరు లేనందున రబీకి నీటి విడుదల చేయడం సాధ్యం కాదు. ఈ పరిస్థితిని రైతులు గుర్తించి ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి.

ప్రశ్న: ఖరీఫ్ సీజన్‌లో ఎంత నీటిని బ్యారేజి దిగువకు (సముద్రంలోకి) విడుదల చేశారు?

జవాబు: ఎగువ నుంచి వచ్చిన వరద నీటిలో సుమారు 900 టిఎంసిల నీటిని సముద్రంలోకి విడుదల చేశాం. 2009 తరువాత ఈ స్థాయిలో నీటిని సముద్రంలోకి మళ్లించడం ఇదే అత్యధికం.

ప్రశ్న: కృష్ణా డెల్టా ఆయకట్టు ఎంత?

జవాబు: కృష్ణాడెల్టా పరిధిలో 13 లక్షల 35 వేల 351 ఎకరాల సాగు విస్తీర్ణంలో ఉంది.

ప్రశ్న: కృష్ణాడెల్టా పరిధిలో కెనాల్స్‌కు ఏ పనులు జరుగుతున్నాయి?

జవాబు: డెల్టాలోని బ్రీచ్‌లు, కెనాల్ స్ట్రక్చర్స్, సూయజ్‌ల, కెనాల్స్ బండ్స్ పటిష్టత తదితర పనులకు సంబంధించి రూ.788.4 కోట్ల అంచనా విలువ కల్గిన 580 పనులు చేయించాల్సి ఉంది. వీటిల్లో కెసి కెనాల్ పరిధిలో రూ.162 కోట్ల అంచనా విలువ కల్గిన 78 పనులు జరగాల్సి ఉంది. అలాగే కెఇ కెనాల్ పరిధిలో రూ.5.21 కోట్ల అంచనా విలువ కల్గిన 57 పనులు, మైనర్ ఇరిగేషన్ (చెరువులు) పరిధిలో రూ.46.8 కోట్ల అంచనా విలువ కల్గిన 260 పనులు, బుడమేరు పరిధిలో ఎఫ్‌డిఆర్ఎం (ఫ్లడ్ డ్యామేజ్ మరమ్మతు, నిర్వహణ) పనులకు సంబంధించి రూ.46.6 కోట్ల అంచనా విలువ కల్గిన 124 పనులు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ ప్రభుత్వం నిధులు. వీటికి సంబంధించిన రిపోర్టును ప్రభుత్వానికి పంపించి 20 రోజులైంది. ప్రభుత్వం నుంచి మంజూరు అయినట్లు ఆదేశాలొచ్చిన వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుంది.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

- జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ పి. ధనశ్రీ

ప్రజాశక్తి-చల్లపల్లి : సమస్యలు పరిష్కరించుకునేందుకు పోరాటాలకు కార్మికుల సిద్ధంగా ఉండాలని జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ పి ధనశ్రీ పిలుపునిచ్చారు. గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో ఆదివారం అవనిగడ్డ నియోజకవర్గం సిఐటియు అనుబంధ రంగాల అవగాహన సదస్సు అవగాహన చల్లపల్లి సిఐటియు మండల అధ్యక్షురాలు సిహెచ్ గంగాభవాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ధనశ్రీ మాట్లాడుతూ అంగన్వాడి కార్మికుల సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. స్కీం వర్కర్స్ పై రాజకీయ వేధింపు ఎక్కువ య్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యమత్యం ఉన్నప్పుడే ప్రభుత్వం దిగి వస్తుందని ఉద్బోధించారు. పంచాయితీ కార్మికుల కాంట్రాక్ట్ పద్ధతి రద్దు చేసి ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన కార్మికులు, పాఠశాల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల పై పాఠశాల కమిటీ రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి మరిచిందని దుయ్యబట్టారు. ఉచిత ఇసుక పథకం దళారుల జేబులు నింపుకోవడానికి తప్ప కార్మికులకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. జిల్లా ఆటో మరియు ట్రాన్స్ పోర్ట్ కార్యదర్శి మద్రాపు పోలినాయుడు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచి రవాణా రంగాన్ని రాష్ట్రం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. జీవో నెంబర్ 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ఆకాశాలు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కార్మికులకు పూట గడవడం కష్టంగా మారిందన్నారు. గత ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బారాల మోపిందని విమర్శించిన టిడిపి కూటమి ప్రభుత్వం నేడు 12 వేల కోట్ల రూపాయలు భారీ మోపిందని అన్నారు. కార్మికుల కర్షకుల కోసం నిరంతరం పోరాటం చేసి కమ్యూనిస్టు మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కషి చేయాలని, సభలో పాల్గొనాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాలరావు, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసరావు, వివో ఏ జిల్లా కోశాధికారి వెలివోలు భారతి, చల్లపల్లి మండల మధ్యాహ్న భోజన పథకం అధ్యక్షురాలు మద్దాల నాగరాణి, చల్లపల్లి మండల పాఠశాల ఆయా సంఘం అధ్యక్షురాలు హేమలత, మొవ్వ అంగనవాడి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు, సిఐటియు కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా తదితరులు మాట్లాడారు.

ఈ -క్రాఫ్ నమోదు చేయలేదని కలెక్టర్ కు వివరిస్తున్న సర్పంచ్

ఈ-క్రాప్ చేయలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలంలోని లంకపల్లి, పుషడం, దేవరకోట తదితర గ్రామాలలో ఆదివారం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పర్యటించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అచ్చెంపాలెం గ్రామసర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు కలెక్టర్ ని కలిసి తమ గ్రామంలో గత నాలుగేళ్ళుగా ఈ క్రాఫ్ నమోదు చేయటం లేదని ఫిర్యాదు చేశారు. ఈ క్రాఫ్ చేయకపోవటం వల్ల పండిన పంటను అందిన కాడికి అమ్ముకుని సొమ్ము చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. ఏవో మురళీకష్ణ సమాధానమిస్తూ ఈ –క్రాఫ్ చేశామని కలెక్టర్కు వివరిస్తుండగా సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు కల్పించుకొని నాలుగేళ్లుగా తన పొలానికే ఈ క్రాఫ్ జరగలేదని, తనతోపాటు ఎంతో మంది రైతుల పంటలు కూడా ఈ క్రాఫ్ నమోదు చేయలేదని తెలిపారు. దీంతో కలెక్టర్ అధికారులను ఆదేశిస్తూ గ్రామంలో ఎంత మందికి ఈక్రాఫ్ చేశారు, ఈ క్రాఫ్ ఎందువల్ల చేయలేదని, ఎన్ని సంవత్సరాల నుంచి ఈ క్రాఫ్ నమోదు చేయలేదో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తెలుగురావుపాలెం గ్రామ పరిధిలో కూడా పలు రైతులు వీఏఏ ఈ క్రాఫ్ట్ నమోదు చేయలేదని ఆరోపిస్తున్నారు. పూషడం గ్రామ సర్పంచ్ అంకం మారుతీరావు కలెక్టర్ ని కలిసి తమ గ్రామ ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం ఇచ్చారు. దేవరకోట రైతులు వేమూరి రత్నశేఖర్, హనుమాన్ల సురేంద్రనాథ్ బెనర్జీ కలెక్టర్ తో ఘంటసాల మండలంలో ధాన్యం తేమను తగ్గించుకోవడానికి మిల్లర్ల వద్ద డ్రైయర్లు అందుబాటులో లేవని దానివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని డ్రైయర్లు ఏర్పాటుకు కషి చేయాలని కోరారు. ఇంకా ప్రధాన సమస్యగా ఉన్న 1262 ధాన్యం అమ్మకాల్లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-అవనిగడ్డ : హైదరాబాదుకు చెందిన ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్స్ వారి సహకారంతో అవనిగడ్డ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు ఆధ్వర్యంలో అవనిగడ్డలోని ఎస్ వి ఎల్ జూనియర్ డిగ్రీ కళాశాలల ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. డాక్టర్ సోమాచారి పేషెంట్లను పరీక్షించి సలహాలు అందించి అవసరమైన వారికి ఆధునిక చికిత్సకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో 105 మంది వైద్య శిబిరానికి హాజరు కాగా 35 మంది కి ఆధునిక చికిత్స అవసరమని డాక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో యానాది మహానాడు ప్రధాన కార్యదర్శి నక్క విజయబాబు, ఆది రామ మోహన్ రావు, పాట ఆంజనేయులు, గుడివాక రామాంజనేయులు పాల్గొన్నారు.

పడకేసిన వరి పొలాలు

- అదనపు ఖర్చుతో రైతన్న ఆవేదన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలో కురిసిన వర్షాలకు వరి పొలాలు వర్షపు నీటిలో తడిచి, కుళ్లి పోయే ప్రమాదానికి దారి తీస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోతకొ చ్చిన పొలాలు పడకేయటంతో ఆ వరి చేలపై నీట మునిగి పంట పనికి రాకుండా పోయే టట్లు ఉంది. ఆరుగాలం కంటికి రెప్పలా కాపాడిన పంట ఏమైపోతుందోనని రైతులు బెంబేలెత్తి పోతున్నారు. పడకేసిన పొలాలను లేపి కూలీలతో కోయించటంతో కోతకే ఎకరానికి రూ.20వేలు అవుతుందని రైతులు వాపోతున్నారు. వర్షాలకు ముందు మామూలుగా కూలీలతో కోయిస్తే... రూ.10వేల కంటే ఎక్కువ అయ్యేది కాదని అంటున్నారు.

సగం ధాన్యం వర్షం పాలే...

- పామర్తి వెంకటేశ్వరరావు, రైతు కౌతవరం,

వర్షాలకు మా చేలో వరి కోతకొచ్చి పడ కేసింది. దానిని కూలీలతో లేపి కోయిం చేందుకు 40మందిని ఏర్పా టు చేశా. కూలీలకే ఎకరానికి రూ.20 వేలు ఖర్చయింది. అసలు ఎకరానికి రూ.10వేలతో కోత కోయించేయవచ్చు. ఈ వర్షాల కారణంగా ఖర్చు డబల్ అయ్యింది.

వైన్స్ షాపుల వద్దే తాగుడు

- మద్యం సేవిస్తూ గత నెలలో కాలువలో పడి వ్యక్తి మృతి
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మద్యం పాలసీలో భాగంగా అవనిగడ్డలో ఇరవై వ్యక్తులు వేలంపాటలో రెండు మద్యం షాపులను చేజిక్కించుకొని వాటిని నిర్వహిస్తున్నారు. ఈ రెండు షాపులు బస్టాండ్ ఎదురు రోడ్‌లోని కేఈబి కెనాల్ పక్క రోడ్డులో ఏర్పాటు చేయగా వారి షాపులు ఎదురుగానే మందుబాబుల కోసం రెండు పందిర్లను కూడా ఏర్పాటు చేశారు. దీనితో మద్యం కొనుగోలు చేసి కొందరు షాపు దగ్గరే మద్యం సేవిస్తుండగా మరికొందరు ఎదురుగా ఉన్న కాలువ లైనింగ్ గోడపై కూర్చొని మద్యం సేవిస్తున్నారు. దీనితో గత నెలలో బంధాలయ చెరువు గ్రామానికి చెందిన గుగ్గిలు రమేష్ కాలువలో పడి మతి చెందగా తాజాగా ఐదు రోజుల క్రితం సయ్యద్ సలీం అనే వ్యక్తి మద్యం షాప్ ఎదురుగా కాలువలో జారిపడగా అక్కడివారు హుటాహుటిన ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని కాలువలో కొట్టుకుపోతున్న సలీమును రక్షించారు. ఇప్పటికీ ఈ రెండు సంఘటనలు చోటుచేసుకునగా మరోవైపు షాపుల పక్కన రూమ్ కూడా ఉండటంతో నిబంధనలకు విరుద్ధంగా ఆ రూములో మద్యం సేవించడం జరుగుతుంది. నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలి తప్ప అక్కడ కూర్చొని తాగేందుకు ఎవరికీ పర్మిషన్ లేకపోయినప్పటికీ దీనిని ఎవరు పట్టించుకోవడం లేదు. మరోవైపు రహదారిపైనే వాహనాలు నిలిపి మద్యం షాపులకు వెళుతుండగా అటుగా ప్రయాణం చేసే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ఐదు దాటితే మహిళలు ఆ రహదారిలో వెళ్లే అవకాశం ఉండదు. అంతేకాకుండా సామాన్యమైన ప్రజలు రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మద్యం షాపులు నిబంధనల ప్రకారం నడుస్తున్నది లేనిది వారికి సంబంధమే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఒకవైపు బార్ షాపులు సైతం 10 గంటలకు షాపులు మూసే స్తుండగా మద్యం షాపుల వారు మాత్రం 10 దాటిన విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో అసలు మద్యం షాపుల వారికి సమయపాలన ఉందా లేదా అనేది ప్రశ్నార్ధక మయింది. మద్యం షాపుల వల్ల అనర్ధాలు జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని, కనీసం కాలువల లైనింగ్ గోడలపై కూర్చొని మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వైన్ షాపుల వద్దే తాగుతున్న మందుబాబులు



స్వాధీనం చేసుకున్న జెసిబి

అక్రమ ఇసుక రవాణా అడ్డగింత

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామ పరిధిలో ఉన్న కష్ణానది రేవులో పలువురు ఆక్రమ ఇసుక దందాకు పాల్పడ్డారు. శనివారం రాత్రి జేసీబీ సహాయంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు రవాణాను అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఇసుక రవాణా విషయమై రెవెన్యూ, పోలీసులకు సమాచారం వెళ్లిందన్న విషయం తెలుసుకున్న అక్రమార్కులు ట్రాక్టర్లతో బయటికి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న వీఆర్వో శివప్రసాద్ వీఆర్ఏ తో కలసి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా, క్వారీ ప్రాంతంలో జేసీబీ కనిపిం చింది. ఈ సమయంలో జేసీబీని ఎందుకు ఉంచారని ప్రశ్నించగా, అక్రమార్కులు వీఆర్వోతో వాగ్వాదానికి దిగారు. వీఆర్వో పోలీసులకు, తహసీల్దార్లకు ఫోన్లో సమాచారం ఇచ్చిన అనంతరం జేసీబీని పోలీస్ స్టేషన్ కు తరలించారు. రెడ్ జోన్ ఉన్న క్వారీలో ఇసుక తవ్వకాలు జరపటానికి అనుమతులు లేవని తహసీల్దార్ విజయప్రసాద్ స్పష్టం చేశారు. పాపవినాశనం క్వారీ రెడ్ జోన్లో ఉన్న విషయం తెలిసినా అక్రమాలు ఇసుక దందాకు బరి తెగించారన్నారు.

సంగీతాలను ఆలపిస్తున్న ప్రముఖ సంగీత కళాకారులు

అలరించిన సంగీతం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి కళావేదికపై ఆదివారం ఆలపించిన సంగీతం పలువురుని ఆకట్టుకుంది. స్థానిక కళాకారులు, గాయకులు దేవీ కృతులు ఆలపించిన, కృష్ణవేణి సంగీత నీరాజనం మూడో రోజు వేడుకలు ఆకట్టుకున్నాయి. కళాకారులను శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామీ దేవస్థానం అధికారులు, ప్రధాన అర్చకులు సన్మానించి, ఈ మహా సంగీత ఉత్సవానికి అందించిన వారి విశేష సేవలను గుర్తించారు. ప్రఖ్యాత కళాకారులు భారతీయ సంప్రదాయ సంగీత సంపదను ప్రతిబింబించే కర్ణాటక సంగీత కృతులు అందించనున్నారు. ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించలేకపోయిన వారికి, ఈ కార్యక్రమ వీడియోలు పర్యాటక మంత్రిత్వ శాఖ అధికారిక యూట్యూబ్ ఛానల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ కార్యక్రమం ద్వారా భారతదేశం వైభవమైన సాంస్కృతిక వారసత్వాన్ని, సంగీత పర్యాటకాన్ని మరింతగా ప్రచారం చేయడం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కళాకారులు మల్లాది సూరిబాబు, మల్లాది శ్రీరామ్ ప్రసాద్, మల్లాది రవికుమార్, మల్లాది మోదుమూడి సుధాకర్, పోవూరి గౌరీనాథ్, పోపూరి గాయత్రి, విష్ణుభట్ల కృష్ణవేణి, మల్లాది కార్తీక త్రివేణి, నరసమ్మ బృందం, ఇతర ఆర్కెస్ట్రా బృందం పాల్గొన్నారు.

నకిలీ పింఛన్లు ఏరివేతకు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - నందిగామ : సామాజిక భద్రతా పింఛన్లలో అక్రమాలపై తనిఖీలను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసిపి పాలనలో వికలాంగులు, ఇతర కేటగిరీల్లో భారీగా అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తొలి విడతగా జిల్లాకు ఒక గ్రామ/వార్డు సచివాలయాన్ని ఎంపిక చేస్తారు. తనిఖీలకు పక్క మండలానికి చెందిన అధికారులను నియమించి ఒక్కో తనిఖీ బృందం 40 పింఛన్లను మాత్రమే పరిశీలిస్తుంది. మలి విడతలో పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహించి అనర్హుల ఏరివేత కార్యక్రమం జరుగుతుంది.

రోడ్డు పగలగొట్టి వదిలేశారు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణం ఎనిమిదో వార్డులో యాపిల్ హోండా షోరూం రోడ్డులో నివాసముంటున్న ప్రజలు ఆదివారం ఉదయం 8వ వార్డు ప్రజలు ప్రభుత్వ విప్ ఎంఎల్ఎ సౌమ్యకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సౌమ్యతో 8వ వార్డు ప్రజలు గత ప్రభుత్వం హోండా షోరూం నుండి డాక్టర్ నరసింహారావు ఇంటి వరకు పైపులైను పనులు కోసం రోడ్డు పగులగొట్టి వదిలేశారని తమ వీధిలో వర్షం పడితే సిఎం రోడ్డు నుండి మొదలుకొని వచ్చే నీరు మొత్తం తమ ఇళ్లల్లో చేరుతుందని, కారు వెళ్లాలంటే ఆ రోడ్లో భయంతో వెళ్లాల్సి వస్తుందని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

రోడ్డు సమస్యపై ఎంఎల్ఏకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కంచికచర్ల మండల పరిషత్‌లో

నిధులు గోల్‌మాల్ ?

కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయం

ప్రజాశక్తి - కంచికచర్ల : ఉన్నతాధికారుల అజమాయిషి కొరవడటంతో కిందిస్థాయి అధికారులు ప్రభుత్వ నిధులను స్వాహా చేయటం పరిపాటిగా మారింది. ఇటీవలి కాలంలో ఈ తరహా నిధుల స్వాహా పర్వం వివిధ శాఖలకు పాకుతోంది. వివిధ పనులు కోసం కార్యాలయాలకు వచ్చే వారి నుండి మామూళ్ళు దండుకోవటం కొందరి నైజం అయితే, మరికొందరు ప్రభుత్వ నిధులను వివిధ మార్గాలలో దోచుకోవటం నిత్య కత్యమైంది. తాజాగా కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఒక అధికారి ప్రభుత్వానికి జమ చేయాల్సిన నిధులు జమ చేయకుండా స్వాహా చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. సదరు అధికారి 2.91 లక్షల నిధులను గోల్ మాల్ చేసినట్లు తెలుస్తోంది. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జాతీయ రహదారి పక్కన 1988లో అప్పటి మండల పరిషత్ అధ్యక్షులు మల్లెల పుల్లయ్య బాబు, మాజీ మంత్రి స్వర్గీయ కాకాని వెంకటరత్నం పేరుతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ తర్వాత ఈ షాపులను టెండర్ల ద్వారా అద్దెకిచ్చారు. అద్దె దారులు ప్రతినెల మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ అధికారికి అద్దెలు చెల్లించి రసీదులు పొందుతారు. ఇందుకు సంబంధించి 2023 జూన్లో అద్దెదారుల నుండి వసూలు చేసిన రూ.77,301లు, జూలై లో రూ.77,647లు, సెప్టెంబర్లో రూ.77,361లు, అక్టోబర్లో రూ.50,219లు వెరసి రూ.2 లక్షల 91 వేల 528 లు అద్దెగా చెల్లించారు. ఈ మొత్తానికి షాపుల యజమానులకు రసీదులిచ్చారు. ఈ మొత్తాన్ని సదరు అధికారి మండల పరిషత్ సాధారణ నిధులకు జమ చేయాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు జమ చేయకపోవడంతో ఈ నిధులు దుర్వినియోగం చెందాయని వెలుగులోకి వచ్చింది. ఈ అధికారి మండల పరిషత్‌పై పూర్తి పెత్తనం ఇటీవల వరకు కొనసాగించారు. అయితే సదరు అధికారి కీసర ఇసుక డంపింగ్ యార్డ్ ఇన్చార్జ్‌గా నియమించారు. ఇక్కడ కూడా సదరు అధికారిపై ఆరోపణలు రావటంతో ప్రభుత్వం ఇతనిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేసింది. గత ఫిబ్రవరి నుండి షాపులు యజమానులు చెల్లించాల్సిన అద్దె మొత్తాన్ని బ్యాంకులో చలానాలు కట్టడం ప్రారంభించటంతో ఈ అధికారికి నిధుల దుర్వినియోగం చేయడానికి తిరిగి అవకాశం లభించలేదు. ఎంపిడిఒకు, జిల్లా ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ శాఖా పరమైన చర్యలకు ఇంతవరకు సిపార్సు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు జరిపి సదరు అధికారిపై తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇక్కడ విశేషం ఏమిటంటే నిధులు దుర్వినియోగం చేసిన అధికారిని ఆ నిధులను చెల్లించమని ఉన్నతాధికారులు బతిమిలాడుతున్నారు తప్ప చర్యలు తీసుకోకపోవడం విశేషం.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలేవి ?

ప్రజాశక్తి - గంపలగూడెం : గంపలగూడెం ప్రధాన రహదారి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేకపోవడంతో ప్రయాణికులకు దినదిన గండంగా మారింది. దేవి థియేటర్ మలుపు ప్రారంభం నుండి పార్థసారథి హోటల్ వరకు, ఎవరిష్టానుసారం వారిదే అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వివిధ గ్రామాల నుండి వచ్చి పోవు ప్రయాణికులకు అత్యంత సమస్యగా ఈ ట్రాఫిక్ మారింది. ఇందులో చిన్న పిల్లలు వృద్ధులు వికలాంగులు పరిస్థితులు వర్ణాతీతం. ముఖ్యంగా గాంధీ సెంటర్లో అడ్డగోలుగా, వివిధ కార్యకలాపాలు కొనసాగించడంతో మరింత ఇరుకుగా మారింది. ఉన్నదే కొంత, దానిని పునరుద్ధరించి ప్రయాణికులకు సౌకర్యంగా మార్చాల్సిన పంచాయతీ అధికారులు పత్తా లేకుండా పోయారు. గతంలో రక్షణ శాఖ గాంధీ సెంటర్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు చేపట్టేవారు. కానీ ఇటీవల నూతన ప్రభుత్వ హయాంలో అది మచ్చుకు కూడా కనిపించడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. మొత్తంగా గంపలగూడెం ప్రధాన రహదారి ఉన్న దుకాణాల వద్ద సైతం అడ్డు అదుపు లేకుండా వాహనాలు నిలిపివేయడంపై ప్రయాణికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పై విషయాలు పరిగణనలోకి తీసుకొని నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మలుపు వద్ద అడ్డంగా ఆపిన వాహనం

15న వైద్యశిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : జనవిజ్ఞానవేదిక జెవివి తిరువూరు శాఖ, జిబిఆర్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15న ఆదివారం బిపి, షుగర్, ఫిట్స్ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జెవివి ప్రతినిధులు ఎం.నాగేంద్రప్రసాద్, ఎం.హరికృష్ణ, కె.పాపారావు తెలిపారు. తిరువూరు నాగార్జున స్కూల్‌లో ప్రతి రెండు నెలలకొకసారి 3వ ఆదివారం నిర్వహించే ఈ రెగ్యులర్ మెడికల్ క్యాంపునకు రోగులు కనీసం 2,3 రోజుల ముందుగా బిపి, షుగరు పరీక్షలు చేయించుకుని రిపోర్టులతో వైద్య శిబిరానికి హాజరుకావాలని తెలిపారు. ఈ క్యాంప్‌లో 2 నెలలకు సరిపడ అన్ని మందులు కేవలం రూ.200లకే ఇవ్వనున్నట్లు జన విజ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 9491545653, 9492487133, 9441056 670కు సంప్రదించాలని కోరారు.

రైతులే పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - నందిగామ : ఈ రబీ సీజన్ నుండి రైతులే తాము వేసే పంటలకు ఇన్సూరెన్స్ కట్టుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టడంతో నందిగామ ప్రాంతంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి యేటా ప్రభుత్వమే రైతులకు పంటల బీమా చేయించేది. 'ప్రధానమంత్రి పసల్ భీమా యోజన (ఇన్సూరెన్స్)' పరిధిలోకి రావాలంటే రైతు నేరుగా 'ప్రీమియం (డబ్బులు)' చెల్లించి నమోదు చేసుకోవాలని నిబంధన తేవటంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పంటలు పండక రైతులు అనేక రకాలుగా ఆర్థికంగా, మానసికంగా విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడుతున్న తరుణంలో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా పంటలు బీమాను రైతులే కట్టుకోవాల్సి రావడంతో అనేక వ్యయప్రయాసలు పడుతున్నారు. రబీ సీజన్‌కి 'క్రాప్ లోన్' తీసుకున్నా రైతులకు అయితే ఆ బ్యాంక్ వాళ్లే ప్రీమియం చెల్లిస్తారు. రబీలో 'లోన్ లేని రైతులు, కౌలు రైతులకు' 'రైతు సేవా కేంద్రం'లో 'క్రాప్ సౌన్ సర్టిఫికెట్' ఇవ్వడం జరుగుతుంది.

రైతులకు పంటల ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలంలోని చిట్టేల – ఆంజనేయపురం గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం పనులను ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రారంభించారు. చిట్టేల సర్పంచ్ తుమ్మల పల్లి శ్రీనివాసరావు, ఆంజనేయపురం గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు సిసి రహదారి నిర్మాణ పనులకు సూచనలిచ్చారు. ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణం చేపట్టిన సిమెంట్ రోడ్లను ఎస్‌సి కాలనీలలో ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్‌లు తెలిపారు. తమ గ్రామంలో రహదారి సౌకర్యం కల్పిస్తున్న ఇరు గ్రామాల సర్పంచ్‌లను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో షేక్ సత్తార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

'శ్రీ కళా' లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఉక్కు కళావేదికలో ఆదివారం శ్రీ కళావేదిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కళా సంస్థ 'ఆవిష్కరణోత్సవం నిర్వహించారు. జగ్గయ్యపేటలో ఉన్న సంగీత, సాహిత్య, నాట్య, నాటక, చిత్రకళ, శిల్ప, వేదికలో ఉన్న కళాకారులను ఒక వేదికపై తీసుకువచ్చి శ్రీ కళావేదికగా నామకరణం చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం సందర్భంగా 'శ్రీ కళా' లోగోను జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు ప్రారంభించారు. స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య స్థానిక కళాకారులను సత్కరించారు. శ్రీ కళావేదికపై వివిధ కళాకారులు వారు వారి విన్యాసాలు నిర్వహించారు. కూచిపూడి నృత్య కళాకారులు భారతీదేవి నృత్య శిష్య బృందం దుడకా ఉజ్వల వారి సంస్కృత కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కెడిసిసి మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, స్థానిక వార్డ్ కౌన్సిలర్ రామలక్ష్మి, బుచ్చిబాబు తదితర కళాకారులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి అమీర్పూర్, హైదరాబాదు వాస్తవ్యులు పెరుమాళ్ళ కృష్ణ కిషోర్, పెరుమాళ్ళ వీర వెంకట సత్యనారాయణ మూర్తి రూ.11,116లు నగదు రూపంలో విరాళంగా అందజేసినట్లు దేవస్థాన వంశపారం పర్యధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదతు, కార్యనిర్వహణాధికారి శ్రీ కానూరి సురేష్ బాబు తెలిపారు.

మద్దతు ధర కోసం రైతుల పాట్లు

- తేమశాతం ఉందంటూ ధర తగ్గిస్తున్న మిల్లర్లు
- ఆరబోతలో రైతన్నల నిమగ్నం
- మరో తుపాను ప్రభావంతో ఆందోళన

రోడ్డు పక్కన ఆరబోసిన ధాన్యం రాశులు

ప్రజాశక్తి-గన్నవరం : ఆరుగాలం చెమటోడ్చి పండించిన ధాన్యానికి మద్దతు ధరను పొందేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ధాన్యం ఆరబోతకు కూలీల ఖర్చు భారమైనా తేమ శాతం తగ్గితే మంచి ధర లభిస్తుందని అన్నదాతలు ఆశాభావంతో ఉన్నారు. ధాన్యం ఆరబోసి మిల్లులకు తరలించే పనుల్లో నిమగ్నమవుతున్నారు. నియోజకవర్గం లోని బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్, గన్నవరం మండలాల్లో ఈ ఏడాది 94,977 ఎకరాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి సాగు జరిగింది. 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికే రైతులు మిల్లులకు తరలించారు. ఫెంగల్ తుఫాన్ భయంతో రైతులు వణికి పోయారు. వారం క్రితం పూర్తిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశం మేఘావతమై కారు మబ్బులు కమ్మాయి. మోస్తరు వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, ప్రధాన రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాసుల అడుగున నీరు చేరింది. తడిసిన ధాన్యాన్ని రాసి నుంచి వేరు చేసి మిగిలిన ధాన్యాన్ని అతికష్టం మీద సంరక్షించుకున్నారు. ధాన్యం తడవడం వల్ల చాలా గ్రామాల్లో రైతులు ఒక్కో ఎకరాకు మూడు బస్తాల వరకూ ధాన్యం నష్ట పోయారు. అయితే మిగిలిన పంటకు మద్దతు ధరను పొందేందుకు రైతులు దష్టి సారించారు. నాలుగు రోజులుగా వాతావరణం తెరపివ్వడం, పగటి ఉష్ణోగ్రతలు పెరగడం, ఎండ కాస్తుండటంతో ధాన్యం ఆరబోత పనుల్లో నిమగ్నమయ్యారు. ఎకరం ఆరబోతకు ముగ్గురు నుంచి నలుగురు కూలీలు పని చేస్తున్నారు. రోజుకు రూ.1,500 చొప్పున నాలుగు రోజులకు ఆరబోతకు రూ. ఆరువేలు ఖర్చు అయిందని చెప్తున్నారు. మరోవైపు ఇంకో తుఫాన్ ఉందని మీడియాలో రావడంతో హడలెత్తిపోతున్నారు. ధాన్యం ఆరబోతతో తేమశాతం ప్రభుత్వ నిబంధనలకు లోబడి 17 శాతంకు వస్తే 75 కి బస్తాకు రూ.1,700పైగా ధర లభిస్తుందనే ఆ ఉన్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వరి కోతి ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ధాని మార్కెట్కు చేరుతోంది రహదారులు, బహియ ప్రదేశాల్లో ధాన్యం రాసులు నిల్వ చేస్తున్నా రాత్రివేళ మంచుకు ధాన్యం నిమ్ముకుపోకుండా పరదాలు కప్పి నాణ్యత దెబ్బతినకుండా కాపాడుతున్నారు. ధాన్యం రోడ్డు మీద నుంచి మిల్లులకు చేరిన అక్కడ తేమశాతం ఎంత చెబుతారోనని కంగారుపడుతున్నారు. రెండు మూడు రోజులపాటు మిల్లులో ఆరుబయట ధాన్యం బస్తాలు పడవేస్తే మంచుకు చెమ్మ వచ్చి తేమశాతం ఎక్కువగా చూపుతున్నారని, ఆ మేరకు కొంత ధరలో తగ్గించి ఇచ్చే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్నశ్రీ కొండలమ్మ అమ్మవారి ని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకొని, అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానమునకు విచ్చేసిన యాత్రికులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ, వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు.

కుక్కల స్వైరవిహారంతో జనం బెంబేలు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : బాపులపాడు మండలం బండారుగూడెంలో కుక్కల స్వైర విహారంతో జనాలు బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. రాత్రిళ్ళు, పగలు పిల్లలపై గ్రామ సింహాలు దాడి చేస్తున్నాయని చెప్తున్నారు. వీటి స్వైర విహారం దెబ్బకు జనం రాత్రివేళ రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వాహనాలకు పాదచారులకు అడ్డం పడుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. గ్రామపంచాయతీ అధికారులు కుక్కల నివారణ చర్య తీసుకోవాలని సిపిఎం పార్టీ నాయకుడు బర్రె లెనిన్ కోరుతున్నారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కుక్కలను పట్టించి దూరంగా అడవుల్లో వదిలి పెట్టాలన్నారు.

రెడ్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-గన్నవరం : సేవా కార్యక్రమాల ద్వారా రెడ్ వాలంటీర్లు ప్రజల్లో మమేకం అవడం గొప్ప విషయమని సావరగూడెం గ్రామ పెద్దలు కితాబిచ్చారు. ఆదివారం గన్నవరం మండలం సావరంగూడెం గ్రామంలో సుందరయ్య రెడ్ వాలంటీర్స్ సేవా కార్యక్రమాలు కొనసాగాయి. గ్రామంలో పూడిపోయిన మురుగు కాలువలో పూడికలు తీశారు. ముళ్ళపొదలు నరికి శుభ్రం చేశారు. బీసీ కాలనీలో మురిగిపోయే ప్రధాన కాలువలో పూడిక తీశారు. టీం లీడర్ మోటమర్రి నాగ బ్రహ్మాచారి, కళ్ళం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరావు, భౌతుల నాగరాజు, తాతబ్బాయి, కైలే ఏసుదాసు, కళ్ళంకోటయ్య, కామినేని శ్రీనివాసరావు, కడవకొల్లు సీతారామరాజు, గ్రామస్తులు సహకరించారు.

శ్రమదానం చేస్తున్న వాలంటీర్లు

చిరస్మరణీయులు ఝాన్సీ లక్ష్మీబాయి

- మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటం వద్ద పూలమాలలు వేసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-గన్నవరం : ఉపాధ్యాయ వృత్తిలో కర్రా ఝాన్సీ లక్ష్మీబాయి ఓ విశిష్ట గుర్తింపు పొందారని, యుటిఎఫ్ జిల్లా నేత కర్రా వరప్రసాద్ అడుగుజాడల్లో ముందుకు సాగటం ద్వారా ఉపాధ్యాయుల్లో చిరస్మ రణీయులుగా మిగిలిపోయారని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం గన్నవరం రాయనగర్‌లోని కల్చరల్ కళ్యాణమంటపంలో కీ. శే. కర్రా ఝాన్సీ లక్ష్మీబాయి సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఆమె చిత్రపటానికి యుటిఎఫ్ నేతలు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగంలో ఉన్నప్పుడు విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడిన ఆమె కుటుంబం అభివద్ధికి కూడా శక్తి వంచన లేకుండా కషి చేశారని గుర్తు చేశారు. మనం ఎంత కాలం ఉన్నాం అనేది ముఖ్యం కాదని, జీవితంలో ఎంతమందికి ఉపయోగపడ్డామనేది ముఖ్యం అన్నారు. ఝాన్సీ ఆశించిన విధముగా విద్యావ్యవస్థ మనుగడ కోసం అందరూ పునరంకితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మరీదు వరప్రసాద్, జి.రాజ బాబు, శివ ప్రసాద్, రిటైర్డ్ ఎండిఓ ఏంజెల్ విజయ్ కుమార్, గొల్లనపల్లి హైస్కూల్ హెచ్ఎం జగదీశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఐవిఎం హోమ్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చిన్నారి బాలబాలికలు ఉజ్వల భవిష్యత్ పొందాలని ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని పురిటిగడ్డలోని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ హెూమ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ క్రిస్మస్ సందేశం అందించారు. చిన్నారులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మాటలను గౌరవిస్తూ చిన్ననాటి నుంచే మంచి అలవాట్లతో ముందుకు సాగాలని సూచించారు.అనంతరం ఐవీఎం ఫౌండేషన్ ద్వారా డాక్టర్ వేములపల్లి సురేష్ ఆర్థిక సహాయంతో ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతి వరకూ వివిధ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న 106 మంది బాల బాలికకు క్రిస్మస్ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వేములపల్లి విజయ, వేములపల్లి సోఫీ పాల్గొన్నారు.

కొమ్మినేని సాంబశివరావును అభినందిస్తున్న దృశ్యం

అవార్డు రావడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిది

ప్రజాశక్తి-గుడివాడ : మరోసారి జాతీయ స్థాయి ఉత్తమ విద్యాసంస్థ అవార్డును విద్యావికాస్ బ్రెయిన్ ఫీడ్ ఈటి టెక్ఎక్స్ అవార్డును సొంతం చేసుకోవడం గొప్ప విషయమని విద్యావికాస్ ఫౌండర్, డైరెక్టర్ ముప్పాల సుబ్బారావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యావికాస్‌లో డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావును అభినందించే సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముప్పాల సుబ్బారావు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదిన హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొంది విద్యావికాస్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈట్రైల్ బ్లేజర్ అవార్డును దక్కించుకుదన్నారు. ఈ పురస్కారం అందుకోవడానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపల్ నిమ్మగడ్డ కృష్ణారావు, లయన్స్ మాజీ గవర్నర్ యలమంచిలి పూర్ణచంద్రప్రసాద్, ఆశీర్వాదం, ఉమాదేవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకిచ్చిన మ్యానిఫెస్టో అమలు చేయాలి

ప్రజాశక్తి-నాగాయలంక : రైతుల సంక్షేమం కోసం ఎన్నికల సమయంలో విడుదల చేసిన ఆక్వా రైతుల మ్యానిఫెస్టో అమలుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన నాగాయలంకలోని మత్స్య భవనం వద్ద విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్రం లోని లక్షలాదిమందికి జీవనోపాధి కల్పిస్తూ, దేశానికి కొట్లాదిరూపాయల విదేశీ మారక ద్రవ్యం అర్జించి పెట్టే ఆక్వా రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రంగం పరిరక్షణకు, అభివద్ధికి అవసరమైన చర్యలు తక్షణం తీసుకోవాలని లకనం ప్రభుత్వాన్ని కోరారు.

ఒకే బాటలో కూటమి, గత వైసిపి ప్రభుత్వాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మోడీ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ ఆటలు రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం ఒకే విధానాలు అనుసరించడం గర్హనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ అన్నారు. పట్టణంలోని డి.వి.ఆర్.నగర్‌లో కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో ఆదివారం జగ్గయ్యపేట మండల 5వ మహాసభ జుజ్జువరపు వెంకటరావు, దంతాల రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముందు సిపిఎం జెండాను సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డి.వి.కృష్ణ మాట్లాడుతూ మోడీ అదానీని కాపాడుకుంటూ ఈ రాష్ట్రాన్ని ఆదాని ప్రదేశ్‌గా మార్చి ప్రజలు నెత్తిన భారాలు మోపుతుంటే రాష్ట్రంలో ఉన్న పాలక పార్టీలు అన్ని వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్నాయన్నారు. సెకి ఒప్పందాన్ని చేసుకున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పై విచారణ చేసి చర్యలు తీసుకోకపోగా ఆ ఒప్పందాన్ని కొనసాగిస్తున్నట్లు కనపడుతుందన్నారు. కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లుతో సంబంధం లేదని ప్రజా సమస్యలే ధ్యేయంగా పోరాటం చేస్తుందని తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కష్ణానది నీటిని అందించాలని, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, కోతులు, కుక్కలు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న డి.వి.కృష్ణ

మండలం నూతన కార్యదర్శిగా సోమోజు నాగమణి

జగ్గయ్యపేట మండల నూతన కార్యదర్శిగా సోమోజు నాగమణి తిరిగి ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. వారిలో కోటా కృష్ణ, కోటా రవికుమార్, కె.శ్రీనివాసరావు, జుజ్జువరపు వెంకటరావు, దంతాల నరేంద్ర, దంతాల రాజేశ్వరి, సోమోజు ప్రణయ్ తేజ, దాశరధి భాస్కర్, దాసరి నాగేశ్వరరావు, షేక్ గౌస్‌మియా, కాకబోయిన వెంకటేశ్వరరావు, ఎస్.నాగమణిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, సిపిఎం సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, సిపిఎం వత్సవాయి మండల కార్యదర్శి బి.రాము, సిపిఎం సీనియర్ నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, సిపిఎం సభ్యులు పాల్గొన్నారు.

నందిగామలో శానిటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి - నందిగామ : కోడి కూయకముందే నిద్రలేచి నందిగామ పురపాలక సంఘం కమిషనర్ ఈవి రమణబాబు నందిగామ పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించారు. నందిగామ పట్టణంలో పురపాలకసంఘ కార్యాలయ బయట ప్రాంగణం నుండి ప్రధాన రహదారులు వరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. సదరు డ్రైవ్‌లో వ్యాపారులు, ప్రజలు వ్యర్థాలను ఎక్కడా రోడ్ల మీద వేయకుండా, ప్రధాన రహదారుల్లో గల డ్రైనేజీల్లో పారవేయకుండా పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు వేయాలని తెలిపారు. తద్వారా పట్టణంలో పర్యావరణం కలుషితం కాకుండా ఉండేందుకు సహకరించాలని తగు సూచనలు చేశారు. సదరు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో నందిగామ పురపాలకసంఘ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడికలు తీయిస్తున్న కమిషనర్ రమణబాబు

శారీరక, మానసిక ఆరోగ్యం కోసం 3కె రన్

ప్రజాశక్తి - కంచికచర్ల :

ప్రతి వ్యక్తి ఎదుగుదలలో శారీరక ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యమైనదని నందిగామ గ్రామీణ సిఐ చవాన్ అన్నారు. కంచికచర్ల ఏకత్వ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక ఆల్ఫా హోటల్ నుండి ఏకత్వ పాఠశాల వరకు ఆదివారం నిర్వహించిన 3కె రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మనిషి ఎదుగుదలలో విద్యార్థి దశ కీలకమైనదన్నారు. విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్‌లకు బానిస కాకుండా ఆటలు, వ్యాయమం వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా చురుకుగా ఉండడమే కాకుండా భవిష్యత్తు అభివృద్ధికి దోహద పడతాయని అన్నారు. 3కె రన్‌లో విద్యార్థులు, తల్లితండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అమరనేని రమేష్ బాబు, డైరెక్టర్లు కార్తీక్, మనోజ్, సింధూర, శాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాగర్ జలాల కోసం రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలోని మెట్ట రైతులు సాగర్ జలాల కోసం రైతులు నాగార్జునసాగర్ కాలువ వైపు సాగునీరు ఎప్పుడు వస్తుందా అని చూస్తున్నారు. వీరులపాడు కంచిచర్ల మండలాలు రైతులు పెద్ద ఎత్తున మిర్చి మొక్కజొన్న సాగుచేశారు. నాగార్జునసాగర్ జోన్‌లో ఉండటం వల్ల ఈ ప్రాంత రైతులకు నవంబర్లో సాగర్ జలాల విడుదల చేయడానికి నీటిపారుదల శాఖ అధికారులు ప్లాన్ రూపొందించారు. అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం రైతులకు నీరు వచ్చే పరిస్థితి లేదు. తెలంగాణలోనే ఖమ్మం జిల్లా ఎరుపాలెం మండలంలోని పలు గ్రామాల ద్వారా సాగర్ జలాలు రావాల్సి ఉంది. తెలంగాణ ప్రాంతంలో సాగర్ కాలువలు ఉన్న ఊటీలు పెద్ద ఎత్తున ధ్వంసం అయ్యాయి. వాటిని మరమ్మతు చేయడానికి ఖమ్మం జిల్లా నాగార్జునసాగర్ అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయట్లేదు. జమలాపురం చెరువు తూర్పు భాగాన నాగార్జునసాగర్ కాల్వలకు పెద్ద పెద్ద గండ్లు పడ్డాయి. వాటిని మరమ్మతులు చేస్తే తప్ప వీరులపాడు మండలం కంచిచర్ల రైతులకు సాగర్ జలాల అందే పరిస్థితి లేదు. నాగార్జునసాగర్ డిస్ట్రిబ్యూటర్ మాజీ చైర్మన్ గురజాల అజయ్‌కుమార్ జమలాపురం వద్ద ఉన్న నాగార్జునసాగర్ కాలువకు పెద్ద గండి పడటం దాని మరమ్మతు చేయాలని తెలంగాణలోనే ఖమ్మం జిల్లా అధికారులను కోరారు. కాల్వలకు మరమ్మతులు చేసి వీరులపాడు మండల రైతులకు సాగర్ జలాలు అందజేయాలని కోరారు. రెండు రాష్ట్రాల అధికారులు నాగర్ సాగర్ కాల్వలను పరిశీలించి గండ్లను పూడ్చాలని గురజాల అజయ్ కుమార్ కోరారు.

దొంగలు హల్‌చల్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణం రైతు పేట మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ఇంటికి కూత వేటు దూరంలో తాళం వేసి ఉన్న జవ్వాజి వేణు ఇంట్లో శనివారం అర్ధ రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వారం రోజుల క్రితం అదే ప్రాంతంలో తాళం వేసి ఉన్న మరొక ఇంట్లో దొంగలు తాళం పగలగొట్టి ఇంటిలో విలువైన వస్తువులు ఏమీ లేకపోయేసరికి వెనుతిరిగి వెళ్లి పోయారు. ఎసిపి తిలక్ ఆధ్వర్యంలో సిఐ నాయుడు పోలీసుల బృందం ఇంటిని పరిశీలించారు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు, దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. నందిగామ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైక్ ద్వారా పోలీసులు ప్రచారం చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి జనవాణి

ప్రజాశక్తి - నందిగామ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సోమవారం నుండి బుధవారం వరకు జనవాణి కార్యక్రమం నందిగామలో నిర్వహిస్తున్నట్లు జనసేన నందిగామ ఇన్‌ఛార్జ్ తంబళ్లపల్లి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం జనసేన సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి పాల్గొని, ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

శంకుస్థాపన చేసిన సౌమ్య

రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కంచికచర్ల : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనులకు ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విప్ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. రూ.65 లక్షలు ప్రభుత్వ నిధులతో కంచికచర్ల పట్టణంలోని నెహ్రూ సెంటర్ నుండి భావనా థియేటర్ వరకు జుజ్జూరు రోడ్డు, నిర్మాణ పనులకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం గుంతలు లేని రాష్ట్రంగా మార్చేందుకు రోడ్ల అభివృద్ధికి వేల కోట్లు ప్రభుత్వ నిధులు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, టిడిపి నాయకులు వేమా వెంకట్రావు, కిషోర్, జనసేన నాయకులు దేవిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు కృషి చేయాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ శ్రీరామ్ తాతయ్య పాల్గొని కార్యవర్గం చేత ప్రమాణ స్వీకార చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్యవర్గం సమాజ సేవ కోసం కృషి చేయాలని పేద బలహీన వర్గాలు అభివృద్ధికి కృషిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆర్యవైశ్యులు వ్యాపార రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా ముందుండాలని కోరారు. యువత గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర విభాగ అధ్యక్షురాలు రజిని జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి చిన్న రామ సత్యనారాయణ బొగ్గవరపు వెంకట రాజారావు తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. గౌరవ అధ్యక్షులు పైడిమరి జగన్మోహన్‌రావు, అధ్యక్షులు పబ్బతి రామకృష్ణ ప్రధాన కార్యదర్శి శ్రీ దూపుగుంట్ల శ్రీనివాసరావు కోశాధికారి శ్రీనివాసరావు కిరాణా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ పైడిమర్రి రామకృష్ణ సేవాదళ్ అధ్యక్షులు సీతారామయ్య ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీరాం

ఉప్పెల్లి విజయరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సౌమ్య

విజయరావుకు నివాళి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గంలోని రాఘవపురం గ్రామ సీనియర్ టిడిపి నాయకుడు ఉప్పెల్లి విజయ రావు శనివారం గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న నందిగామ శాసనసభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఉప్పెల్లి విజయరావు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. తదుపరి పార్టీ కోసం ఎన్నో సేవలు చేశారని వారి కుటుంబానికి ఏ అవసరమైన తప్పకుండా ఆదుకుంటానని ఇచ్చారు.

పెనుగంచిప్రోలు స్కూల్ ప్రిన్సిపాల్ నిర్వాకం

ప్రజాశక్తి - వత్సవాయి : యూనిఫామ్ కింద షు వేసుకు రాలేదని, హోం వర్క్ చేయలేదని విద్యార్థుల్ని కర్రతో కొట్టిన సంఘటన మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో జరిగింది. ఆ గ్రామంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థిని కొట్టడంతో చేతి వేళ్ళు వంకర్లు పోవడంతో చికిత్స కోసం పెనుగంచిప్రోలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వదిలి వెళ్లారు. తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థినికి చికిత్స చేయించుకున్నారు. పాఠశాల యాజమాన్యం చికిత్స చేసే సమయం వరకు ఉండకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే ప్రిన్సిపల్‌పై గతంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో కంచికచర్ల మండలం ఆర్యవైశ్య సంఘం సమావేశం ఆదివారం జరిగింది. మాజీ మండల ఆర్యవైశ్య అధ్యక్షులు అత్తులూరి యాదగిరి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాళ్ళ సత్యం బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులుగా జల్లా తిరుపతి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పెరుమల్ల యశ్వంత్ ,కోశాధికారిగా ఊటుకూరి కుమార్ ఎన్నుకున్నారు. నాళ్ల సత్యం బాబు మాట్లాడుతూ జనవరి 5న ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రుపట్ల రవి కిషోర్, జూలూరు విశ్వనాథం పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు, వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్లలో పలు రేషన్ దుకాణాలను, రేషన్ పంపిణీ చేసే వాహనాలను తహశీల్దార్ పి.జాహ్నవి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డీలర్లు, వాహనదారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. రేషన్ దుకాణాలు, ఎండియు వాహనాల డీలర్లకు రేషన్ బియ్యం పంపిణీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ఎండియు వాహన యజమానులు ఎవరు రేషన్ బియ్యం కొనుగోలు చెయవద్దన్నారు. ఎండియు వాహన వ్యవస్థ వల్ల వల్ల రాష్ట్రంలో రేషన్ బియ్యం అవకతవకలు జరుగుతున్నాయని అలా జరగకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్, విఆర్ఒలు గౌస్ పాల్గొన్నారు.

గన్నవరం మండలంలో

పడకేసిన పారిశుధ్యం

- రహదారుల వెంబడి గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తకుప్పలు

రోడ్డు వెంబడి చెత్త కుప్పలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలో పలు గ్రామాలను పారిశుధ్య సమస్య పట్టి పీడిస్తోంది. గన్నవరం, ముస్తాబాద, తెంపల్లి, చిన్న అవుట పల్లి, దావాజీగూడెం, అల్లాపురం, వి.ఎన్ పురం వంటి ప్రధాన గ్రామాలతో పాటు అంతర్గత రహదా రుల్లో చెత్త కుప్పలు చిన్న సైజు గుట్టలుగా పేరుకుపో తున్నా పంచాయతీ అధికారులకు పట్టడం లేదనే వాదన ఉంది. పరిసరాలు శుభ్రంగా ఉంచుతున్నాం. చెత్తను ఎప్పటిక ప్పుడు తొలగిస్తున్నా మంటూ ఊదరగొట్టడం తప్ప పరిష్కార మార్గాలు మాత్రం చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలోని పలు అంతర్గత రహదారుల్లో డ్రెయిన్లు ఆధ్వాన స్థితికి చేరుకున్నాయి. సరైన పర్యవేక్షణ లేక పోవడంతో మురుగునీరు పొంగి రహదారులపైకి చేరుకుంటోంది. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నామని చెప్పుకుంటున్న పంచాయతీ అధికారులు ఆ దిశగా ప్రగతి సాదించ లేకపోతున్నారని ఆరోపణలు వెల్లువె త్తుతున్నాయి. ఇక చెత్త డంపింగ్ చేయడానికి అనువైన స్థల కొరతతో ఈ సమస్య కాస్తా పరిష్కారం కాని సమస్యగా తయారైంది. దీంతో గ్రామంలో పలు చోట్ల ఇష్టారాజ్యంగా చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో అంత గ్గత రోడ్లు, ప్రధాన రహదారుల వెంట చెత్త డంపింగ్ కేంద్రాలు వెలుస్తున్నాయి. ఆయా రోడ్లపై రాకపోకలు సాగించే వారికి ఆటంకంగా మారుతుంది.గ్రామంలో నిర్వహించే పారిశుధ్య, అభివద్ధి పనులు ప్రధాన ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. గన్నవరంలో యాదవుల బజారు, ఎస్సీ కాలనీ, రాయ నగర్, రాంనగర్ పలు ప్రాంతాల్లో సమస్యలు మేట వేసినా అధికారులు, పాలకులకు పట్టడం లేదు. ముఖ్యంగా నివాసాల మధ్య ఉన్న పలు ఖాళీ స్థలాలు పాములు, పురుగులు చేరి ప్రమాదకరంగా మారాయి. వీటిపై పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.గ్రామంలో రహదారుల పక్కనే చెత్త డంపింగ్లు వెలుస్తున్నా పంచాయతీ అధికారులు చూసీ చూడ నట్లుగా ప్రవర్తిస్తున్నారు. డ్రైయిన్లు అభివద్ధికి నోచుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు పారుదల సజావుగా ఉండటం లేదు. మురు గునీరు రోడ్లపైకి చేరుకుంటోంది. పారిశుధ్య నిర్వహణపై బి. సి ప్రాంతాల్లో పం చాయతీ అధికారులు ప్రత్యేక దష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకుంటాం : ప్రసాద్, సెక్రటరీ, గన్నవరం

గ్రామంలో ఖాళీ స్థలాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తాం. పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగు పరచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామంలో పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య చెత్త డంపింగ్ చేయకుండా. ప్రజలకు అవగాహన పరుస్తున్నాం. పారి శుద్ధ్య సిబ్బందిచే చెత్తను తొలగించ జేస్తున్నాం. యంత్రం వినియోగిస్తున్నాం. సమస్యాత్మకంగా మారిన డ్రైయిన్లను పూడిక తీయిస్తున్నాం.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-చల్లపల్లి : కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని కష్ణాజిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు మోర్లశివ, చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని నానిలు అన్నారు. స్థానిక ఎస్ టీ కాలనీ లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నూతన సభ్యులకు, రెన్యువల్ చేయించుకున్న వారికి సభ్యత్వ నమోదు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాత ప్రదీప్, బెల్లంకొండ రాజు, ముమ్మనేని సన్నీ, కుంభ. కష్ణ. తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలు మూలల నుంచి వచ్చిన 540 మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు కణితి శశిరేఖ హనుమకొండ దుర్గ భవాని, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి గుడివాడ హోమియో వైద్యులు పి భవాని, తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.

మందులు అందిస్తున్న సి.ఎల్ వెంకటరావు

ఇరిగేషన్ భూమి ఆక్రమణకు యత్నం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని వల్లూరుపాలెం గ్రామంలో కరకట్ట దిగువన ఉన్న ఇరిగేషన్ భూమిని ఆక్రమించేందుకు సమీప పొలంలోని విజయవాడకు చెందిన వ్యక్తి ప్రయత్నించాడు. ఆదివారం కావడంతో అధికారులు ఎవరూ లేని సమయంలో జెసిబి మిషన్‌తో ఇరిగేషన్ భూమిలో ఉన్న 1930 సంవత్సరం క్రితం వంతెన పడగొట్టి తన చేనుకు సదన చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన గ్రామస్తులు, స్థానిక ఇరిగేషన్ సిబ్బంది అతనిని అడ్డుకుని పోలీస్ వారికి సమాచారం అందించారు. ఇరిగేషన్ జేఈఈ జనార్ధన్ సంఘటన స్థలానికి చేరుకుని మిషన్ ను స్వాధీనం చేసుకుని ఆక్రమణ పనులు నిలుపుదల చేశారు. కరకట్ట ఏర్పడక ముందు కష్ణానది లో నుంచి తాగు, సాగు నీరు ఈ వంతెన ద్వారా అనేక ప్రాంతాలను కలుపుకుంటూ దిగువన ఉన్న ఏలూరు వరకు వెళ్లేవని ఇరిగేషన్ అధికారులు తెలుపారు. ఈ భూమి, వంతెన ఇరిగేషన్ అధికారులకు సంబంధించినవి అని స్పష్టంగా తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-మోపిదేవి : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల, బాపట్ల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా ఆదివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలో రావి వారిపాలెం ఎన్.ఎస్.ఎస్ వాలంటిర్స్ కషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల ఆధ్వర్యంలోని వ్యవ సాయ కళాశాల బాపట్ల అగ్రికల్చర్ రావెప్ విద్యార్థినీలు గ్రంథాలయం శుభ్రపరిచారు. గ్రంథలాయం లోని పుస్తకాలను జర్నల్స్ గ్రంథాలయం మొత్తం వాతావరణాన్ని శుభ్ర పరిచారు. దీనిలో భాగంగా అలమరలు ఫ్లోరు ఇతర ప్రాంతాలను శుభ్ర పరిచారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు బొందలపాటీ సుబ్బరావు గ్రంథాలయ పరిపాలన అధికారి కైతపల్లి సుధీర్ కుమార్ జొన్నలగడ్డ పిచ్చేశ్వరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఎన్. ఎస్ ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య' బాపట్ల విద్యార్థినీలు పాల్గొన్నారు.

కావూరి రామకృష్ణకు నివాళి

ప్రజాశక్తి-మోపిదేవి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మోపిదేవి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కావూరి రామకృష్ణ చిత్రపటానికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను ఆదివారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతలు పరామర్శిం చారు. బొబ్బ గోవర్ధన్, కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, కష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్,మేడికొండ విజయ్ తదితరులు రామకృష్ణకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

మినీ కవితల పోటీ విజేత 'వసుధ'

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఈ నెల 9వ తేదీ అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పద్యం, గేయం వచన కవిత, మినీ కవితా ప్రక్రియలలో నిర్వహించిన కవితల పోటీల్లో గుడివాడ పట్టణానికి చెందిన కవి వసుధ బసవేశ్వరరావు మినీ కవిత్వం ప్రక్రియలో విజేతగా నిలిచారు. ఇతర ప్రక్రియల్లో కె.లీలాకృష్ణ (వచన కవిత- తెనాలి), సింగరాజు శ్రీనివాసరావు (గేయం-ఒంగోలు), సూర్యదేవర రవికుమార్ (పద్యం-గుంటూరు) విజేతలుగా నిలిచారని పోటీల నిర్వాహకులు, ప్రముఖ కవి సాహితీ విమర్శకులు, అమరావతి సాహితీమిత్రులు వ్యవస్థాపక అధ్యక్షుడు డా.రావి రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు సోమవారం గుంటూరులో జరిగే అవినీతి వ్యతిరేక కవితా సదస్సులో అందజేయనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

మునిసిపల్ కమిషనర్ అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు సెంటర్లో గల సి స్క్వేర్ ఫంక్షన్ హాల్‌లో ఎగ్జిక్యూటివ్ కమిటీ మున్సిపల్ కమిషనర్ల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు నాగ నరసింహారావు, జనరల్ సెక్రెటరీ బాలస్వామి, పి.భవాని ప్రసాద్ ,రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ ఓబులేష్, కోశాధికారి శివారెడ్డి మిగతా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇతర శాఖలు నుండి డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులను తప్పించినందుకుగానూ మున్సిపల్ కమిషనర్ అసోసియేషన్ ప్రభుత్వానికి సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో కొత్త పోస్టులను సష్టించడం చాలా అవసరం అని,అలా ఏర్పడిన పోస్టులను మున్సిపల్ అధికారులకు మాత్రమే ఇవాలని, అన్ని కేటగిరీల ప్రమోషన్ల ద్వారా ఖాళీలను భర్తీ చేయడానికి డిసిపి నిర్వహించాలని, మునిసిపల్ కమిషనర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి అమరావతిలో 500 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించాలని కోరారు.

3316 రోజుకు స్వచ్ఛ సుందర చల్లపల్లి

ప్రజాశక్తి-చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి సేవా కార్యకర్తలు చేపట్టిన సేవలు ఆదివారం నాటికి 3316 ల రోజులకు చేరాయి. స్వచ్ఛ కార్యకర్తలు వేకుమ జామున 4:20 గంటలకు ప్రారంభించిన సేవలు అశోక్ నగర్ లోని మూడవ లైనులో వాసిరెడ్డి కోటేశ్వరరావు వీధిలో ప్రారంభించిన పారి శుధ్య పనులు అశోక్ నగర్ 4 వ లైనులో ముగిశాయి.స్వచ్ఛ కార్యకర్తలు వీధులను పరిశుభ్రం చేసిరోడ్ కిరు వైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు.తొలగించిన పిచ్చి మొక్కలు, వ్యర్థాలను ట్రాక్టర్ పైడంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు

102 మందికి మధుమేహ పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో ఉచిత మధు మేహ వ్యాధి చికిత్స శిబిరాన్ని ఆదివారం నిర్వ హించారు. డాక్టర్ గవిరి నేని రజని వైద్య సేవలు అందించారు. లయన్ డాక్టర్ నర్రా గంగాధర్ రావు, కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని రామకష్ణ ల ఆర్థిక వితరణతో 102 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, జంగం మోహనరావు, సూరపనేని పరంధా మయ్య, పి. విశ్వేశ్వరరావు, చాపరాల రాజా, గుమ్మడి రామకష్ణ పాల్గొన్నారు.

బైండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నిడుమోలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఎస్సీ కులాలలో భాగమైన ఆంధ్రప్రదేశ్ బైండ్ల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన నిడుమోలు పెద్ది రాజులను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం పాపారావు నియామకపు పత్రాన్ని ఆదివారం అందజేశారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బైండ్ల ఆత్మగౌరవ సభలో ఈ పత్రాన్ని అందజేసినట్లు పెద్దిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘానికి కట్టుబడి ఉండి సేవా కార్యక్రమాలను విస్తత్వం చేస్తానని తెలిపారు.ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న భవకుమార్

ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య భద్రతకు పెద్దపీట వేస్తోందని టిడిపి నేత బొప్పన భవకుమార్ కుమార్ పేర్కొన్నారు. ఆరుష్ రుమటాలజీ ఇమ్యునాలజీ క్లినిక్ ఆధ్వర్యంలో పటమట భద్రయ్య నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఖరీదైన బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు, రుమటాలజీ, ఆర్థరైటిస్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పటమట ప్రాంతం నుండి మాత్రమే కాక చుట్టపక్క ప్రాంత ప్రజలు కూడా ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. టిడిపి నేత బొప్పన భవకుమార్ శిబిరానికి విచ్చేసి ఎముకల సాంద్రత పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ చెన్నుపాటి యోగిత మాట్లాడుతూ వైద్య శిబిరం ద్వారా ప్రజలకు ఖరీదైన పరీక్షలను కూడా ఉచితంగా చేసామని చెప్పారు. వయసు పెరిగేకొద్ది కాలి ఎముకలు మెత్తబడే అవకాశం ఉంటుందని అటువంటి లక్షణాలు ముందే గుర్తించి చికిత్సలు అవసరం లేకుండా ఎముక గట్టిపడేలా సూచనలు చేసినట్లు తెలిపారు. ఆర్థరైటిస్ లక్షణాలు నిర్ధారించడనికి రక్తపరీక్షలు చేసి లక్షణాలను బట్టి చికిత్సను అందజేస్తున్నామని అన్నారు. రుమటాలజీలో ఆటో ఇమ్యూన్ కంటి సమస్యలు, చర్మ, కిడ్నీ సమస్యలు, ఉపరితిత్తుల సమస్యలు, కీళ్లవాతం తదితర సమస్యలకు వైద్య శిబిరంలో పరీక్షలు చేశామని అన్నారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి 50 శాతం రాయితీని అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

విజేతలకు పతకాలందిస్తున్న ఆదాయ శాఖ కమిషనర్ సాకా నరేష్

విపిఎస్ పబ్లిక్ స్కూల్లో ఘనంగా అథ్లెటిక్ మీట్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మొఘల్ రాజపురంలోని సిద్ధార్థ పాఠశాల 42వ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు స్కూల్‌లో వైభవంగా జరిగాయి. ఆదాయ శాఖ కమీషనర్ సాకా నరేష్, ఐఆర్‌ఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాల జెండాను ఎగురవేసి అథ్లెటిక్ మీట్‌ను ప్రారంభించారు. సాకా నరేష్ మాట్లాడుతూ మీ బలహీనతను తెలుసుకుని దానిని సరైన రీతిలో అధిగమించి, అన్ని వైపుల నుండి వారి మూర్తి మత్వాన్ని తీర్చుదిద్దుకునే అవకాశాన్ని క్రీడల ద్వారా పొందొచ్చని సూచించారు. అనంతరం విజేతలకు పతకాలు సర్టిఫికెట్లను అందించారు. ప్రాంగణం అంతా విద్యార్థులు, తల్లిదండ్రులతో స్కూల్ మైదానం నిండిపోయింది. చిన్నారుల కవాతులు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ఎథెనిక్ వాక్, పిరమిడ్ ఫార్మేషన్స్‌తో కూడిన రంగుల ఛత్ర విన్యాసం, జిమ్నాస్టిక్ ఏరోబిక్స్, సింఫనీ వేవ్స్ వంటి ప్రదర్శనలు అద్భుతమైన రీతిలో విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్రమంలో సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ ఎన్.లలిత ప్రసాద్, స్కూల్ కన్వీనర్ సూరెడ్డి విష్ణు, పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ కె.రోజ్ మేరీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనంతో రైతుల్లో దిగులు

ధర, దిగుబడి తగ్గడంతో నష్టాల భయంలో ధాన్యం రైతులు

మద్దతు ధర కోసం ఆరబెట్టిన ధాన్యం

నందిగామ ప్రాంతంలో ధాన్యం బస్తాల్లోకి ఎత్తుతున్న రైతు

ప్రజాశక్తి - నందిగామ : ధరిత్రిని నమ్ముకుని మోసులెత్తిన ఆశలతో ఏరువాకా సాగించి ఏడాది పొడుగునా అరుగాలం కష్టపడి పంట పండించిన రైతన్నలకు అన్నీ కష్టాలు నష్టాలే. అరుగాలం శ్రమించి అన్నదాతలు పండించిన ధాన్యానికి కనీస గిట్టుబాటు ధర కూడా రాకపోవడంతో జిల్లాలో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ అరంభంలో అకాల వర్షాలు వరదలతో తీవ్రంగా నష్టపోయిన వరి రైతులు ప్రస్తుతం పంట దిగుబడులు చేతికంది వస్తున్న తరుణంలో ఫెంగల్ తుఫాన్‌తో మరోసారి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా ప్రతికూల పరిస్థితుల నడుమ ఈ ఏడాది వరి పంట దిగుబడులు ఆశించిన మేర లేకపోవడంతో ధరలు కూడా బస్తాకు రూ.300 నుంచి 400 మేర తగ్గడంతో ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సాగు భారం... ధరలు ఘోరం

వరి సాగు ఈ ఏడాది రైతులకు అరంభం నుంచి భారంగానే మారింది. అతివృష్టి తుఫాన్ల నేపథ్యంలో గత ఏడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది ఎకరాకు 10 బస్తాల వరకు దిగుబడులు తగ్గాయి. గతేడాది ఎకరాకు 40 నుంచి 45 బస్తాల చొప్పున దిగుబడులు రాగా ప్రస్తుతం 30 బస్తాలకు మించి దిగుబడులు రావడం లేదు. సహజంగా దిగుబడులు తగ్గినప్పుడు ధర పెరగాలి. కాని ఇక్కడ మాత్రం ధర దిగుబడులు రెండు తగ్గడంతో రైతులు ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి. గతేడాది బస్తా ధాన్యం 1700 నుంచి 2 వేల వరకు కొనుగోలు చేయగా ప్రస్తుతం 1400 మించి కోనుగోలు చేయని పరిస్థితులు నెలకొన్నాయి.

నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 300లకు పైగా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 6 లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోగా కొనుగోళ్ళు కేంద్రాల వద్ద నామమాత్రంగానే జరుగుతున్న కొనుగోళ్ళు పట్ల అధికారులు మాత్రం స్పందించకపోవడం శోచనీయం. ఇప్పటి వరకు 2 లక్షల టన్నులు ధాన్యం కూడా కొనుగోలు జరగలేదు. రైతులకు సమీపంలో ఉన్న మిల్లులకు కాకుండా దూర ప్రాంతాల్లో ఉన్న మిల్లులకు ధాన్యం తరలించాల్సి రావడం తేమ పేరుతో ధరలతో కోతలు విధించడం, హమాలీల ఖర్చులు అధనం. దిగుబడులు చేతికంది వచ్చే తరుణంలో ధరలు తగ్గడంతో ధాన్యం పండించిన రైతుల కంట కన్నీరు తప్ప ఏమి కనిపించడం లేదు.

జిల్లాలో లక్షన్నర ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది సీజన్ అరంభంలో వాతావరణం అనుకూలించడంతో వరిసాగు అశాజనకంగా సాగింది. గతేడాది కన్న 15 శాతం మేర అదనంగా సాగుచేశారు. ప్రస్తుతం వరి పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కానీ ఫెంగల్ తుఫాన్ వల్ల 17 శాతం కన్న ఎక్కువ తేమ ఉండటంతో ధరలు దారుణంగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో దళారులు రంగప్రవేశం చేసి గ్రామాల్లో రైతుల ఇళ్ళ వద్దకే వచ్చి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు.

పాలకులు అధికారులు స్పందించాలి

ప్రస్తుత తరుణంలో తేమ పేరుతో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న దోపిడీపై అధికారులు పాలకులు స్పందించిన మద్దతు ధర 1700 ఐనా వచ్చేలా ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని దళారులను అరికట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హెచ్‌ఐవి పిల్లలకు న్యూట్రిషన్ అందజేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేతనకొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవితో బాధపడుతున్న 25 మంది పిల్లలకు న్యూట్రిషన్ ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రొమేనియా దేశానికి చెందిన మైఖేల్ బ్రదర్ జాన్ పాల్గొని పిల్లలు బాగా చదువుకొని ప్రయోజకులు అవ్వాలని, వారికి మంచి ఆరోగ్యం, భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 25 మంది పిల్లలకు రూ.25 వేలు విలువైన వస్తువులు నూనె, కందిపప్పు, వేరుశనగలు, బెల్లం, మినప్పప్పు, రాగి పిండి, గోధుమపిండి, బిస్కెట్లు, గోధుమ రవ్వ, బకెట్లు అందజేశారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ ఎలీషా మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులైన పిల్లలను నిరాశపచొద్దని, వారిని ధైర్య పరచాలని, వారి ఆరోగ్యం, క్షేమం కోసం ప్రార్థించాలని అన్నారు. పిల్లలు క్రమశిక్షణలో ఎదగాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రేస్ మినిస్ట్రీస్ సెక్రటరీ సుమలత, అబ్రహం, అనిల్, నాగరాజు, హరీష్ , దీపిక, నాగుల్ బి, సంఘస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు న్యూట్రిషన్, బకెట్లు అందజేస్తున్న దృశ్యం

ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలం కొనకంచి గ్రామ పరిధిలోని పారా మౌంట్ స్టీల్ ఇండస్ట్రీస్ అధినేత వెనిగళ్ళ సురేష్, మేనేజింగ్ డైరెక్టర్ వెనిగళ్ళ ప్రీతం బాబు సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్ష కేంద్రాన్ని ఆదివారం నిర్వహించారు. కొనకంచి అడ్డరోడ్డు పారమౌంట్ కంపెనీలో నిర్వహించిన కంటి పరీక్ష క్యాంపునకు కర్మాగారంలో పనిచేసే వర్కర్లతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైద్య నిపుణులచే, అత్యాధునిక డిజిటల్ పరికరాలతో వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు, కళ్ళజోళ్ళు ఇవ్వనున్నట్లు వైద్య బృందం తెలిపింది. అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ విద్య, వైద్య, ఉద్యోగ, ఆరోగ్యపరంగా నియోజకవర్గంలో ఎనలేని సేవలందిస్తున్న వెనిగళ్ళ సురేష్‌కు పరిసర ప్రాంత గ్రామస్తులు, ఉద్యోగులు, వైద్య బృం దం ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్య క్రమంలో పారమౌంటు సిబ్బందితో పాటు శంకర హాస్పిటల్ బృందం పాల్గొన్నారు.

మక్కపేటలో 'గ్రామీణ పని అనుభవ కార్యక్రమం'

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలంలోని మక్కపేట గ్రామంలో 'గ్రామీణా పని అనుభవ కార్యక్రమం'లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవ పథకం నిర్వహిస్తున్నారు. మక్కపేట గ్రామంలో వయ్యారిభామ నివారణా కార్యక్రమం నిర్వహించి, దాని వల్ల జరిగే నష్టాలను, నివారణ చర్యలను గ్రామ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమం బాపట్ల కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ -1 డాక్టర్ - 1 కె.శ్రీనివాసులు, అధ్యాపకులు డా-1 వి.సీతారామ్ బాబు పర్యవేక్షణలో నిర్వహించారు. ఇందులో మక్కపేట గ్రామ ప్రజలు, బాపట్ల కళాశాల రెవెప్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

కృష్ణలంకలో గల వాసవి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రెటరీస్ ఆత్మీయసమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సమావేశానికి విచ్చేసిన మీడియా ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచ నిరుద్యోగ సమాజంలో ప్రభుత్వ ఉద్యోగసాధనకు లక్షల మందితో పోటీపడి, అహర్నిశలు శ్రమించి విజయం సాధించిన కొద్దిమంది మేధావుల్లో వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు కొందరని తెలిపారు. డాక్టరేట్, మాస్టర్ డిగ్రీస్, అండర్ గ్రాడ్యుయేట్స్ వంటి గొప్ప గొప్ప అర్హతలు కలిగి అప్పటికే మంచి వేతనంతో కూడిన పెద్ద పెద్ద ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న తాము, ప్రభుత్వ ఉద్యోగంపై ఉన్న మక్కువతో ఉన్న అవకాశాలన్నీ వదులుకొని వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులుగా నియామకపత్రాలు అందుకొని, జాయిన్ అయ్యారని తెలిపారు. వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శుల్లో, సుమారు 60 శాతం మహిళా కార్యదర్శులు ఉన్నారని చూడకుండా, ఎటువంటి రక్షణ ఉండటం లేదని అన్నారు. తెల్లవారుజామున 5 గంటలకు బెదిరింపులతో రప్పిస్తూ పబ్లిక్ హాలిడేస్, ఫెస్టివల్ హాలిడేస్ లేకుండా రోజుకు 10 గంటలకు పైగా రోడ్ల వెంబడి చెత్తకుప్పల వెంబడి కాలువ వెంబడి తిప్పారు, అన్నారు. ప్రస్తుతం అదేవిధానం కొనసాగుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ కొనసాగిస్తారా లేదా మార్పులు చేస్తారా అనే విషయం చెప్పాలని అన్నారు. ఈ సమావేశానికి ఆత్మీయ అతిథిగా ఎపిజిఎ రాష్ట్ర నాయకులు రమేష్, నాగసాయి హాజరయ్యారు. రాష్ట్ర వార్డు పర్యావరణ కార్యదర్శుల నాయకులు శంకర్రావు, హనుమంతు, పార్థసారథి, భాను ప్రకాష్, రఫీ, రమేష్, గణేష్, రేఖ, ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.